www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి
భద్రాద్రి
సోమవారం | 02 | నవంబర్ | 2026
పేజీలు : 8

ఖాదర్‌బాబు ఆశయసాధనకు పాటుపడాలి




- కమ్యూనిస్టు ఉద్యమానికి ఊపిరులూదిన ఖాదర్‌బాబు
- ఘనంగా ఖాదర్‌బాబు వర్ధంతి

ప్రజాపక్షం/పాల్వంచ : యువజన నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా, న్యాయవాదిగా పేద ప్రజల అభ్యున్నతి కోసం, వారి హక్కుల సాధన కోసం విశేష కృషి చేస్తూ కమ్యూనిస్టు భావజాల వ్యాప్తికి తన జీవితాంతం పాటు పడిన గొప్పవ్యక్తి ఉప్పుశెట్టి ఖాదర్‌బాబు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌సి కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా సమితి సభ్యులు మిగతా 2లో..

అలా.. ఇలా.. ఎలాగైనా..
పోగేసుకుంటున్నారు..!





-ఉద్యోగులను సైతం కొందరు వదలడం లేదట

-ప్రజాప్రతినిధులపై సన్నగిల్లుతున్న విశ్వసనీయత




ప్రజాపక్షం/ ఖమ్మం : ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రజాసేవలో గడుపుతూ పది కాలాల పాటు ప్రజల మధ్యన నిలిచిపోవాలనుకుంటారు. తమ ప్రాంతాభివృద్ధిపై దృష్టిసారించి ప్రజాప్రతినిధిగా తమకుంటూ ఒక గుర్తింపు ఉండాలన్న తాపత్రయంతో పనిచేస్తుంటారు. ఇది ఇప్పుడు గతమేనన్న భావన కలుగుతుంది. అలా ఇలా ఎలాగైనా అందినకాడికి పోగేసుకోవడమే లక్ష్యంగా కొందరు పనిచేస్తున్నారు. వచ్చిన అవకాశాన్ని ప్రజా సేవకు కాకుండా ఆర్థికంగా బలపడేందుకు ప్రయత్నిస్తుండడంతో మిగతా 2లో..

విచ్చలవిడిగా ఎల్‌పిజి గ్యాస్ దందా..!



- పక్కదారి పడుతున్న రాయితీ గ్యాస్
- పెద్ద సిలెండర్ల నుండి చిన్న సిలెండర్లలోకి
- కార్లు లోనూ నింపుతున్న వైనం
- హోటళ్లలో ఇంటి అవసరాల సిలెండర్లు
- కొరవడిన నిఘా, పట్టించుకోని అధికారులు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలో ఎల్‌పిజి గ్యాస్ అక్రమ దందా విచ్చల విడిగా సాగుతోంది. అక్రమ సంపాదనకు అలవాటు పడ్డ కొందరు ఇంటి అవసరాల కోసం ప్రభుత్వం అందించే సబ్సిడీ గ్యాస్‌ను పక్కదారి పట్టిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మారుమూల ఏజెన్సీ ప్రాంతాలు అధికంగా ఉండటంతో ఈ దందాకు కొలిసొస్తోంది. నెలకు సుమారు 500 సిలెండర్లు జిల్లా వ్యాప్తంగా అక్రమదందాకు వాడుతున్నట్లు సమాచారం

రాయితీ గ్యాస్ పక్కదారి...

ఇంటి అవసరాల కోసం ప్రభుత్వం రాయితీపై 14.2 కేజీల సిలెంటర్‌ను అందిస్తోంది. అయితే కొందరు ఈ సిలెండర్‌లోని గ్యాస్‌ను 2,5 కేజీల సిలెండర్లలోనికి ప్రత్యేక పరికరాల ద్వారా మార్పిడి చేస్తూ ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. అంతే కాకుండా ఎల్‌పిజి గ్యాస్‌తో నడిచేలా ప్రత్యేకంగా కార్లలో కిట్లు తయారు చేయించుకుని నింపుకుని అక్రమంగా దర్జాగా తిరిగేస్తున్నారు. 14.2 కేజీల బరువుండే గ్యాస్ సిలెండర్‌కు ప్రభుత్వం రూ.300 సబ్సిడి అందిస్తోంది. ఏడాదికి పిఎంయూవై లబ్దిదారులకు ఏడాదికి 9 సిలెంటర్లకు ఈ సబ్సిడి వర్తిస్తుంది. దీనిని ఆసరాగా చేసుకుని పలువురు అక్రమ దందాకు పాల్పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 10 ఎల్‌పిజి గ్యాస్ మిగతా 2లో..

ఈ గుట్టు వీడేదెన్నడో..?

-హత్యకు కొత్త కాదు.... విచారణే



ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం జిల్లాలో అంకిత భావం కలిగిన కార్యకర్తలే ఎక్కువ. తాము విశ్వసించే రాజకీయ పార్టీకి కంకణబద్దులై పనిచేసే వారి సంఖ్య మిగిలిన ప్రాంతాలతో పోల్చినప్పుడు చాలా ఎక్కువ. ఈ నేపథ్యంలో రాజకీయ ఆధిపత్య క్రమంలో జిల్లాలో పదుల సంఖ్యలో రాజకీయ హత్యలు జరిగాయి. ఇందులో చాలా మంది జైలు శిక్షలను సైతం అనుభవించారు. హతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేయడం తర్వాత సమగ్ర విచారణ జరిపి సంబంధం లేని వ్యక్తులను రాజకీయ, ఇతరత్రా కక్షలతో నిందితులుగా చేరిస్తే వారిని తొలగించడం జరుగుతూ వచ్చింది. కానీ గతేడాది హత్యకు గురైన సిపిఎం నేత సామినేని రామారావు హత్య కేసులో తద్విరుద్ధంగా జరిగింది. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినా పోలీసులు ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయలేదు. గతంలో జరిగిన హత్యలకు సంబంధించి ప్రత్యక్ష సాక్షులే ఫిర్యాదు చేయలేదు. హతుని కుటుంబ సభ్యులు అనుమానితుల పేర్లు చెప్పిన సందర్భాల్లోనూ కేసులు నమోదు చేసిన విషయం విధితమే. కానీ సామినేని రామారావు కేసు విషయంలో పోలీసుల విచారణ ఈ జిల్లాకు సంబంధించి ప్రత్యేక పద్ధతిలో జరిగింది. రామారావు సతీమణి పేర్కొన్న ఐదుగురిని పోలీసులు విచారించారు కానీ వారే నిందితులని నిర్ధారించ లేదు. పైగా ఏడాదికి నలుగురు నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి వీరే సామినేని రామారావును హత్య చేశారని వెల్లడించారు. రాజకీయ అంశాలతో ముడిపడి సుదీర్ఘ విచారణ జరిగిన ఈ కేసులో పోలీసులు వ్యవహరించిన తీరు ఇప్పుడు అనుమానాలకు తావిస్తుంది. హతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదును తీసుకున్న మిగతా 2లో..

అలా.. ఇలా.. ఎలాగైనా.. పోగేసుకుంటున్నారు..!

(మొదటిపేజీ తరువాయి)

ప్రజల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల పట్ల విశ్వసనీయత సన్నగిల్లుతుంది. కొందరు ప్రతిదానికి ఓ రేటు కట్టి వసూళ్లు చేస్తున్నారన్న విషయం ఆరోపణలు దాటి పోయి రుజువుల వరకు వచ్చింది. డబ్బులు తీసుకుని ఓట్లు వేసే ఓటర్లు ఎంతో కొంత ముట్టజెప్పితేనే పని చేసే ప్రజాప్రతినిధుల నడుమ ఇప్పుడు ఆర్థిక సంబంధం తప్ప మరే సంబంధం లేదన్నది వాస్తవం. గతంలో రాజకీయ నాయకులు ముఖ్యంగా ప్రజాప్రతినిధులపై చిన్న ఆరోపణ వచ్చినా ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించే వారు. కానీ ఇప్పుడు స్పందన లేకపోగా ఏమవుతుంది మహా అయితే ఓటు వేయరేమో ఓటుకు రేటు పెంచితే సానుకూలంగా మారదా అన్న భావన ప్రజా ప్రతినిధుల్లో బలపడుతుంది. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు ముగ్గురు ప్రజాప్రతినిధులు ఇదే అవకాశం ఇక మళ్లీ మనకు అవకాశం వస్తుందో రాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయా నియోజక వర్గాల ప్రజలు చెప్పుకుంటున్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరై గుత్తేదారు పనులు మొదలు పెట్టకముందే కమిషన్ ఇంటికి చేరాలట లేదంటే తమ పలుకుబడిని పదవిని ఉపయోగించి రకరకాల కొర్రీలు పెట్టి పనులు ఆపుతున్నారట. మరికొందరు పనులు అప్పగించడం కమిషన్లు తీసుకోవడం ఎందుకని తమ బినామీల చేతనే పనులు చేయిస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

కమిషన్లతో నాణ్యతకు తిలోదకాలు :

కమిషన్ల వ్యవహారంతో పనుల్లో నాణ్యత కొరవడింది. ప్రజాప్రతినిధులతో నేరుగా సంబంధాలు ఉన్న గుత్తేదారులే పనులు చేస్తుండడంతో ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించడం తప్ప ఏమి మాట్లాడలేని పరిస్థితి. ఎక్కడైనా మాట్లాడితే శాసనసభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు లేదంటే ఉన్నతాధికారుల నుంచి ఆ వైపు చూడవద్దంటూ హుకుం జారీ చేస్తున్నారట. కోట్లాది రూపాయల పనులు గుత్తేదారులు ఇష్టానుసారంగా చేస్తుంటే అధికారులు సైతం సందట్లో సడేమియా అన్నట్లుగా మనకెందుకు మనం ఇచ్చింది పుచ్చుకుంటే పోలే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కొందరు ప్రజాప్రతినిధులు మద్యం వ్యాపారులను పిలిచి ఏమిటి సంగతి అంటున్నారట. ఆ సంగతి ఏమిటో అందరికీ తెలిసిందే. ఉద్యోగుల బదిలీలు, పోస్టింగ్‌ల విషయంలో సమర్పించుకోక తప్పడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఇసుక, మట్టి తరలింపు కొందరి అతిపెద్ద ఆదాయ వనరుగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా తరలింపు జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ వ్యవస్థలు చేష్టలూడిగి చూస్తున్నాయి తప్ప చర్యలు తీసుకునే సాహసం చేయడం లేదు ఎందుకంటే మావాడే వదిలేయండి అన్న ఫోను ఎలాగో వస్తుంది గనుక. ఇవి చాలవన్నట్లు ఒకరిద్దరు స్థానిక నాయకులతో కలిసి అక్రమ వ్యాపారాలను ప్రోత్సహించి ప్రతి నెల క్రమం తప్పకుండా పుచ్చుకుంటున్నారని పెద్ద ఎత్తున ఆరోపణలు వినవస్తున్నాయి. దీనికి స్థానిక అధికారుల సహకారం అందుతుందట.

అనుచరులు అదే దారిలో :

ప్రజాప్రతినిధుల అనుచరులు సైతం వారి పరిధిలో హల్‌చల్ చేస్తున్నారు. మండల అధికారులు ఏమి చేయాలన్న వీరిని అడగాల్సిందే. అలా చేయకపోతే మనం చెప్పింది తప్ప అన్ని చేస్తున్నారు ఇతని వలన మనకు చెడ్డపేరు వస్తుంది ప్రత్యర్థికి సహకరిస్తున్నారంటూ ఫిర్యాదు చేసి మండలాధికారులను సాగనంపుతున్నారు. తమ అక్రమ ఆదాయాలకు అండగా నిలిచే అధికారుల గురించి గోరంతను కొండంత చేస్తూ బదిలీలు కాకుండా అడ్డుకోవడం వీలైనంత మేర మండల కార్యాలయాలే పైరవీలకు అడ్డాలుగా మార్చుకుంటున్నారు. గత ప్రభుత్వంలో ఇలానే కొందరి శృతిమించిన ప్రవర్తన ప్రజాప్రతినిధులకు మొత్తంగా ఆ పార్టీయే ఓడిపోవడానికి కారణమైందన్న వాస్తవాన్ని ఇప్పటి ప్రజాప్రతినిధులు గుర్తెరగాలి. అభివృద్ధి పనులు మంజూరు చేయడం సంక్షేమ పథకాలు అమలుచేసినంతా మాత్రాన సరిపోదు. మనవాళ్లు ఏమి చేస్తున్నారో అన్నది గమనించకపోతే సంక్షేమం, అభివృద్ధి కంటే మిగిలిన విషయాలే రేపటి ఎజెండా అంశాలు అవుతాయి. కార్యకర్తలకు స్వేచ్ఛను ఇవ్వడం, అభివృద్ధిలో భాగస్వాములను చేయడం సమ్మతమే కానీ అధికార వ్యవహారాల్లో తలదూర్చేంతగా ప్రోత్సహించడం ఇబ్బంది కరమే.

అధికార యంత్రాంగంలోనూ :

అధికార యంత్రాంగంలోనూ అవినీతి పెరిగిందన్నది ఇప్పుడు అధికార పార్టీ నేతలు సైతం అంగీకరించక తప్పని పరిస్థితి. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్న సామెతగా ప్రజాప్రతినిధులు కఠినంగా వ్యవహరించకపోవడంతో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికీ నిజాయితీగా పనిచేసే అధికారులు ఉన్నప్పటికీ వారు ఎక్కడ ఇమడలేకపోతున్నారు. ఇప్పుడు నిజాయితీగా పనిచేయడం అంటే తరచూ బదిలీలతో అసమర్థ అధికారుల జాబితాలో చేరి పోవడమే. అన్నింటి కంటే నోటి ప్రచారం (మౌత్ పబ్లిసిటి) ప్రధానమైంది. అదే అతి పెద్ద సమాచార వ్యవస్థ. పోగేసుకుంటున్నారన్న విషయం సమాజంలో అట్టడుగు స్థాయికి చేరింది. ఇటీవల ఓ సీనియర్ మంత్రి కమిషన్ల గురించి ప్రజలు చర్చించుకుంటున్నారన్న వ్యాఖ్యాలు సత్యమే. అంతే కాదు చర్చనీయాంశంగా కూడా మారాయి. పిసిసి అధ్యక్షుడే స్వయంగా అవినీతి పెరిగిందన్న మాటలను పరిగణలోకి తీసుకుని సరిదిద్దుకోకపోతే గతం పునరావృతమవుతుంది తస్మాత్ జాగ్రత్త.

ఈ గుట్టు వీడేదెన్నడో..?

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులు వారు హత్య చేయలేదని నిర్ధారణకు వచ్చినప్పుడు ఎవరు హత్య చేశారు, ఎందుకు చేశారు దానికి గల కారణాలు ఏమిటని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది. హత్యకు గురైంది ఓ రాజకీయ పార్టీ రాష్ట్ర నాయకుడు. ప్రజాప్రతినిధిగా సుదీర్ఘకాలం పనిచేసిన వ్యక్తి. దీనితో పాటే ఈ హత్య రెండు రాజకీయ పార్టీల మధ్య పరస్పర విమర్శలకు దారి తీసింది. ఏకంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఈ కేసులో జోక్యం చేసుకున్నారన్న ప్రధాన ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కేసు పురోగతిని, హత్య జరిగిన విధానాన్ని, హత్యకు కారణమైన విషయాలను వెల్లడించాల్సి ఉంది. గతంలో జరిగిన రాజకీయ హత్యలకు సంబంధించి ఎప్పుడు ఈ రీతి జరగలేదు. రాష్ట్ర వ్యాప్తంగానూ అనేక హత్య కేసులను చేధించిన సమయంలో పోలీసులు హత్యకు గల కారణాలను వివరిస్తూ వచ్చారు. కానీ సామినేని రామారావు హత్య కేసులోనే వివరాలను ఎందుకు వెల్లడించలేదన్నది ఆలోచించాల్సిన విషయం. ఇటీవల హైదరాబాద్‌లో ఓ అధికారి సతీమణిని హత్య చేసిన విషయంలోనూ మీడియా సమావేశంలోనూ పూర్తి వివరాలను వెల్లడించారు. రెండు మూడు రోజుల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లిలో ఒక హత్య కేసుకు సంబంధించి పోలీసులు మీడియా ఎదుట హత్యకు గల కారణాలను, హత్య చేసిన విధానాన్ని వివరించారు. ఏడాది తర్వాత నిందితులను అరెస్టు చేసిన సమయంలోనూ వివరాలను వెల్లడించకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఇది రాజకీయ కారణంతోనే పోలీసులు అసలు విషయాలను తొక్కిపట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్న చర్చ సాగుతుంది. అసలు ఈ గుట్టు విప్పేదెన్నడు. అసలు సిపిఎం డిమాండ్ చేస్తున్నట్లుగా ప్రస్తుతం అరెస్టయిన వారు నిందితులు కాకపోతే అసలు నిందితులు ఎవరు, ఒకవేళ వీరే నిందితులైతే ఈ హత్యను ప్రోత్సహించింది ఎవరు, హత్యకు గల కారణాలు ఏమిటి. సుపారీనా, రాజకీయ హత్య, దీని వెనుక ఉన్న వ్యవహారం ఏమిటి అన్నది తేల్చాల్సిన బాధ్యత పోలీసుల పై ఉంది. హత్యలు జరిగిన సందర్భంలో హత్య చేసిన వారు దోషులుగా నిలబడటం సహజమే. కానీ సామినేని రామారావు హత్య కేసుకు సంబంధించి హత్యతో ప్రత్యక్షంగా ఎటువంటి సంబంధం లేని రాజకీయ నాయకులు, అధికారులను కొందరు దోషులుగా నిలబెట్టే ప్రయత్నమే ఇప్పుడు చర్చనీయాంశమైంది.

విచ్చలవిడిగా ఎల్‌పిజి గ్యాస్ దందా..!

(మొదటిపేజీ తరువాయి)

ఏజెన్సీలు ఉండగా సబ్ ఏజెన్సీలకు కొదవే లేదు.

హోటళ్లు, వీధి హోటళ్లలోనూ ఇదే తీరు ఃఅక్రమ గ్యాస్ దందాకు ప్రధానంగా హోటళ్లు అడ్డగా మారుతున్నాయి. ఇంటి అవసరాల కోసం వాడే 14.2కేజీల ఎల్‌పిజి సిలెంటర్ ధర రూ.994 ఉంది. కానీ హోటళ్లు, వీధి వ్యాపారాలు నిర్వహించే హోటళ్లలోనూ, చిప్స్ తయారీ దుకాణాల్లోనూ చిన్న సిలెండర్లే దర్శనమిస్తున్నాయి. వాస్తవానికి 19 కేజీల సిలెండర్లను వినియోగించాలి అయితే ధర రూ.3065 ఉండటంతో హోటళ్ల యజమానులు 14 కేజీల సిలెండర్ల అక్రమంగా వినియోగిస్తున్నారు. వీధి హోటళ్ల నిర్వాహకులు బాహాటంగానే చిన్న సిలెండర్లు వాడుతున్నప్పటికీ కనీసం పట్టించుకునే నాధుడే లేకపోవడంతో సబ్సిడి గ్యాస్ ప్రక్కదారి పడుతోంది. కేవలం 4 కేజీల వ్యత్యాసానికి సుమారు రూ.2 వేల వరకు పెట్టాల్సి రావడంతో వ్యాపారుల కక్కుర్తి మరింత పెరుగుతోంది.

కొరవడిన నిఘా ఃఅక్రమ గ్యాస్ వాడకాలపై నిఘా కొరవడటంతో ఎవరి దందా వారే సాగిస్తున్నారు. 19కేజీల వ్యాపార అవసరాల సిలెండర్లు వాడాల్సిన చోట 14.2 కేజీల సిలెండర్లు వాడుతూ ప్రభుత్వానికి టోకరా వేస్తూ ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నప్పటికీ సంబంధిత శాఖాధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా సివిల్ సప్లై అధికారులు ఆ దిశగా దృష్టి సారించి అక్రమానికి అడ్డకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

ఖాదర్‌బాబు ఆశయసాధనకు పాటుపడాలి



(మొదటిపేజీ తరువాయి)

న్యాయవాది, మునిసిపల్ మాజీ కౌన్సిలర్ ఉప్పుశెట్టి ఖాదర్‌బాబు 9వ, వర్థంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాల్వంచ రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్‌లోని ఖాదర్‌బాబు స్మారక స్థూపానికి పూలమాలలు వేశారు. అరుణపతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా ఎంఎల్‌పి కూసం నేని మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ నేతగా తన రాజకీయ జీవితాన్ని మొదలు పెట్టిన ఖాదర్‌బాబు అంచలంచలుగా జిల్లాస్థాయి నేతగా పేదల నాయకుడిగా ఎదిగిన నేత ఖాదర్‌బాబు అన్నారు. సమస్యలపై తనదైన శైలిలో సమస్యల పట్ల స్పందిస్తూ వాటి పరిష్కారానికి అనునిత్యం శ్రమించేవాడని చెప్పారు. పాల్వంచ ప్రాంత ప్రజలను కమ్యూనిస్టు ఉద్యమాల వైపు మళ్ళించి పార్టీ విస్తరణకు కీలక పాత్ర పోషించాడని కొనియాడారు. ఖాదర్‌బాబు లేని లోటు వ్యక్తిగతంగా తనకు బాదాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాదర్‌బాబుతో ఉన్న గత స్మృతులను గుర్తుకు తెచ్చారు. పాల్వంచ మునిసిపాలిటిలో ప్రజాప్రతినిధిగా, లాయర్‌గా ఈప్రాంతంలో చెరగని ముద్రవేసిన ఖాదర్‌బాబు ఆశయాలను సాధించిన నాడే ఆయనకు ఘనమైన నివాళులర్పించిన వారమవుతామని, నాయకులు, కార్యకర్తలు ఈ బాధ్యతలను స్వీకరించి ఆయన ఆశయాలను సాధించాలని కోరారు. ఆయన ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలను నిర్మించాలని తద్వారా పాల్వంచ ప్రాంతంలో సిపిఐని అగ్రస్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. అనునిత్యం ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన వారికే గుర్తింపు ఉంటుందని, వారినే ప్రజలు చిరస్థాయిగా గుర్తుంచుకొంటారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్ పాషా స్పష్టం చేశారు. పాల్వంచ గడ్డపై కమ్యూనిస్టు ఉద్యమానికి ఊపిరిలూదిన ఉప్పుశెట్టి ఖాదర్‌బాబు మునిసిపల్ కౌన్సిలర్‌గా సేవలందిస్తూ కార్మికుల సంక్షేమానికి, వారి హక్కుల కోసం పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి ఖాదర్‌బాబు అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం మనమంతా పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అదుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పోరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, ఏఎంసి డైరెక్టర్ వాడె లక్ష్మి, టిడిపి నాయకులు అనంతరాములు, వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వి. పద్మజ, డి. సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, ప్రజా సంఘాల నాయకులు శనిగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి సునీల్ కుమార్, వైఎస్ గిరి, శెట్టి చేరాలు, ధరావత్ దినేష్, నామా పండు, నవీన్, కాకటి రవీందర్, ఆదినారాయణ, రవి, కిరణ్, నాగేశ్వర రావు, వెంకన్న, ప్రేమ్‌చంద్, ప్రశాంత్, వెంకన్న, రమేష్, కొమురయ్య, అల్లి వెంకటేశ్వర్లు, ఇరుకులపాటి సుధాకర్, అన్నారపు అశోక్, నాగమల్ల సత్యనారాయణ, క్రిష్ణవేణి, దుర్గారావు, ఇరుకు రమేష్, అనిల్, ఖాదర్‌బాబు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రెండు మండలాల రెండు గ్రామాల సరిహద్దు వివాద స్థల పరిశీలన



ప్రజాపక్షం/పెనుబల్లిఃపెనుబల్లి కల్లూరు రెండు మండలాల వివాద భూమి హద్దులను ఆదివారం జిల్లా డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే నాగభూషణం పరిశీలించారు. పెనుబల్లి మండలం తాళ్లపెంట రెవెన్యూ కల్లూరు మండలం గోకవరం రెవెన్యూ మధ్య భూములు కలిగిన కర్రల పాడు, ఎర్ర బంజర, బత్తులపల్లి గ్రామాల మధ్య గలిగిన భూములు గతంలో పెనుబల్లి మండలం తాళ్లపంట రెవిన్యూ లో ఉన్నాయని కానీ ఇప్పుడు కల్లూరు మండలం గోకవరం రెవిన్యూ లో చూపిస్తున్నాయని దీనిపై కొంత కాలంగా భూమి హద్దుల మధ్య వివాదం జరుగుచున్నది. మాకు మా భూములను పెనుబల్లి మండలంలో తాళ్లపెంటలో కలపాలని కరాలపాడు చెందిన రైతులు గ్రామ సభలో సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ యాదవ్ ను కోరారు. అలాగే సర్వే అధికారులను సమస్య వివరించారు. దీంతో జిల్లా డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే సందర్శించి హద్దుల మధ్య నెలకొని ఉన్న రాళ్లను చూసి సమస్య స్థానిక రైతులతో కలిసి గుర్తించడం జరిగింది. ఈ సమస్యపై రికార్డు క్షుణ్ణంగా పరిశీలించి జిల్లా అధికారులకు వివరించి సమస్య పరిష్కారానికి త్వరగా కృషి చేస్తామని నాగభూషణం తెలిపారు. సమస్య పరిష్కారానికి ఇరు గ్రామాల రైతులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెనుబల్లి, కల్లూరు మండల సర్వేయర్లు ఈ శ్రీనివాసరావు, ఈశ్వరి, జిపిఓ సత్యవాణి, లైసెన్స్ సర్వేయర్లు స్వప్న, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు



-సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా స్వామిక వ్యతిరేక విధానాలు దేశాన్ని అభివృద్ధి పరంగా తీవ్ర అదోగతి పాలు చేస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు విమర్శించారు. ఆదివారం ఖమ్మం మంచికంటి భవన్‌లో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ ప్లీనరీ సమావేశంలో పోతినేని సుదర్శన్ పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయంగా కార్పొరేట్ వ్యవస్థకు నాయకునిగా ఉన్న ట్రంప్ అనుసరిస్తున్న విధానాలకు కేంద్ర ప్రభుత్వం తలొగ్గి భార తదేశ ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడుతుందని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దారపోస్తుందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై అణిచివేతలకు పాల్పడుతుందని, ఎస్ఎఫ్ఐ విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని మొదటిగా ప్రశ్నించిందన్నారు. ఓటరు సమగ్ర సవరణ (సర్) ను దేశంలో ఓటర్ల తొలగింపుకు వాడారన్నారు. దేశంలో సుమారు 13 కోట్ల మంది ఓటర్లను, తెలంగాణ రాష్ట్రంలో 70 లక్షల మంది ఓటర్లను తొలగించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. సిపిఎం నాయకుడు సామినేని రామారావు దారుణ హత్య నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రి అనుసరిస్తున్న హత్యా రాజకీయాలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ఇటువంటి హత్యా రాజకీయాలను నిలదీస్తూ పోరాడతామన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి పరిస్థితుల కారణంగా కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయన్నారు. కరువు మండలాల్లోని రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలను అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలన్నారు. 14 రకాల నిత్యావసర వస్తువులను అందించాలని కోరారు. ఈనెల 15న నల్గొండలో జరిగే అఖిల భారత కిసాన్ మహాసభకు ఖమ్మం జిల్లా నుండి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, బండి పద్మ, బండి రమేష్, వై. విక్రం, మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు కాంగ్రెస్ పార్టీ ఆస్తులు కావు

- రాజకీయ వివక్షకు స్వస్తి పలికి, అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించాలి
- ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లలో అన్యాయంపై
సిపిఐ జిల్లా సభ్యుడు ఉన్నం రంగారావు



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ప్రభుత్వ పథకాలు కాంగ్రెస్ పార్టీ ఆస్తులు కావని, ఇవి ప్రజాధనంతో అమలవుతున్న పథకాలని ఇందులో ఏ ఒక్క పార్టీకి గుత్తాధిపత్యం లేదని సిపిఐ జిల్లా సమితి సభ్యుడు ఉన్నం రంగారావు స్పష్టం చేశారు. ఆదివారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల సిపిఐ కార్యాలయంలో ఏదులాపురంమున్సిపాలిటీ, ఖమ్మంరూరల్ మండల సిపిఐ జిల్లా సమితి సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హతే ప్రామాణికంగా ఉండాలని, రాజకీయ అనుబంధం ఆధారంగా అభ్దిదారులను ఎంపిక చేయడం సరికాదన్నారు. పార్టీ జెండాలు మోసిన వారికే ప్రాధాన్యత ఇస్తూ, ఏళ్లుగా సొంత ఇల్లు లేక నిరుపేదలుగా జీవిస్తున్న కుటుంబాలకు అన్యాయం చేస్తున్నారంటూ ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పించారు. కేవలం కాంగ్రెస్ పార్టీ వాళ్లే ఓట్లు వేస్తే ప్రభుత్వం ఏర్పడలేదని, ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చారన్న విషయాన్ని గుర్తెరగలన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించాల్సిన బాధ్యతను విస్మరించకూడదని హితవు పలికారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తోందని, వృద్ధాప్య, వితంతు, వికలాంగ, చేనేత కార్మికుల పెన్షన్ల విషయంలో లబ్ధిదారులను నిరీక్షణకు గురిచేస్తోందని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రోసిడింగ్స్ పంపిణీతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలను సైతం అధికార పార్టీ కార్యక్రమాలుగా మార్చుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిని సర్పంచులు,కౌన్సిలర్లకు ప్రభుత్వ కార్యక్రమాల్లో తగిన గౌరవం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి భంగం కలగించకుండా ప్రభుత్వ కార్యక్రమాల్లో రాజకీయ ఆధిపత్య ధోరణులకు స్వస్తి పలకాలని సూచించారు. ఏదులాపురంమున్సిపాలిటీ, ఖమ్మంరూరల్ మండలంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, సంక్షేమ పథకాల అమలులో వివక్షకు తావులేకుండా చూడాలని డిమాండ్ చేస్తూ రేపటి నుంచే దశలవారీ ప్రజా ఉద్యమాలు చేపడతామని ప్రకటించారు. ఇందులో బాగంగా మున్సిపల్, రెవెన్యూ కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్‌రావు, వెంపటి సురేందర్, ఎట్లపల్లి శంకరయ్య, బూర నాగేశ్వరరావు, బానోత్ రాంకోటి, పాల్తియా శ్రీను, సిపిఐ కౌన్సిలర్లు దండి రంగారావు, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మహనీయుడు తూము ప్రకాశరావు

-బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



-క్యాంపు బిపి, షుగర్ పేషంట్లకు వరం
-ఆర్ఎంపీడబ్ల్యూఏ టిఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని



ప్రజాపక్షం/బోనకల్ : పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రాణాన్ని త్యాగం చేసిన మహనీయుడు తూము ప్రకాశరావు అని తెలంగాణ గ్రామీణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు అన్నారు. అదివారం మండల కేంద్రంలోని తూము ప్రకాశరావు భవన్‌లో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో సిపిఐ సీనియర్ నాయకులు, అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం 74వ బిపి, షుగర్ ప్రత్యేక క్యాంపు విజయవంతమైంది. ఈ సందర్భంగా బొమ్మినేని కొండలరావు మాట్లాడుతూ నేటి మధిర ప్రాంత అభివృద్ధి వెనుక కమ్యూనిస్టు ఉద్యమాల త్యాగగాథ దాగి ఉందన్నారు. పేదలు, వ్యవసాయ కూలీలు, దళితుల హక్కుల కోసం తూము ప్రకాశరావు నిరంతరం పోరాడారని, ఆయన జీవితం ప్రజా ఉద్యమాలకు ఆదర్శమని కొనియాడారు. బిపి, షుగర్ పేషంట్లకు బత్తినేని ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు ఓ వరమని, మండల ప్రజలు ఈ క్యాంపును సద్వినియోగించుకోవాలని కోరారు. బిపి, షుగర్‌తో బాధపడేవారు తప్పనిసరిగా మందులు క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. రోజు వారీ బిపి, షుగర్ మందులు వాడటం వల్ల ఎటువంటి హానీ జరగదని, రోజువారి వాడటంవల్ల అలవాటుగా మారుతుందని చాలా మంది అపోహతో మందులు నిలిపివేస్తున్నారని అన్నారు. దీనివల్ల పక్షవాతం, గుండెజబ్బులు, ఇతర సమస్యలు తలెత్తున్నాయని తెలిపారు. ఛాతినొప్పి, గ్యాస్ట్రైటిస్, తలనొప్పిగా సాధారణంగా భావించరాదని, వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వైద్యులు ప్రశంస 100 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు చేతుల మీదుగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు ఆకెన పవన్, మాతంగి శ్రీనివాసరావు, జానకీపురం మాజీ సర్పంచ్ చిలకా వెంకటేశ్వర్లు, క్యాంపు నిర్వాహకులు యంగల గిరి, ఉజ్వలచరణ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని ఎనిమిదవ డివిజన్ పరిధిలో పట్టభద్రుల ఎంఎల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచనల మేరకు బిఆర్ఎస్ నాయకులు భూక్యా అశోక్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాలనీలో బొడ్రాయి సమీపంలో ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గోపాలపురం, బాలపేట, ఎల్‌బి నగర్ ప్రాంతాలకు చెందిన పాత పట్టభద్రుల ఓటరు జాబితాలో ఉన్న 432 మంది ఓటర్లకు ఫోన్ చేసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వివరాలు సేకరించడంతో పాటు ఇంకా నమోదు చేసుకోని వారి వివరాలను సేకరించి వారికి సంబంధించిన పత్రాలను తీసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ 10 రోజులుగా ఎనిమిదవ డివిజన్ పరిధిలో పట్టభద్రులను కలిసి ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇప్పటి వరకు 100 మందికి పైగా పట్టభద్రుల ఓట్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. గతంలో పట్టభద్రుల ఓటు ఉన్న మరల ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు కేంద్రం నవంబర్ ఆరు వరకు కొనసాగుతుందని అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన యువకులు పాల్గొన్నారు.

లీతికకు ఇండియన్ గ్లోరీ అవార్డు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరానికి చెందిన చిన్నారి అనంతోజు లీతిక ప్రతిష్టాత్మక ఇండియన్ గ్లోరీ 2026 అవార్డును దక్కించుకుంది. ఖమ్మం నగరానికి చెందిన శివ శృతి దంపతుల కుమార్తె లీతిక జిమ్నాస్టిక్స్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తుంది. లీతిక ప్రతిభకు గుర్తింపుగా జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ ఆడిటోరియంలో మేడిది వెంకటేశ్వరరావు, కళారత్న మూవీస్, మేడిది సుబ్బయ్య ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు సుమన్, మిమిక్రీ కళాకారుడు, సినీ డైరెక్టర్ మల్లం రమేష్ చేతుల మీదుగా లీతికకు అవార్డును అందజేసి మెమోంటోతో సత్కరించారు. చిన్న వయస్సులోనే లీతిక జిమ్నాస్టిక్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించి స్పోర్ట్స్ స్కూల్‌లో ఉచిత సీటు దక్కించుకుందని వక్తలు కొనియాడారు. లీతిక ప్రతిభను గుర్తించి శిక్షణ అందిస్తున్న కోచ్‌లు ఇందిర, విక్రమ్ లతో పాటు స్పోర్ట్స్ స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావును ప్రశంసించారు. జాతీయ స్థాయి అవార్డు సాధించి ఖమ్మంజిల్లా పేరును నిలబెట్టాలని ఆకాంక్షించారు.

జనగణనలో బిసి కుల గణన చేయాలి

-బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం



ప్రజాపక్షం/ ఖమ్మం : కేంద్ర ప్రభుత్వం 2027లో చేపట్టే జనగణనలో బిసి కుల గణన తప్పకుండా చేపట్టాలని వక్తలు కోరారు. బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఖమ్మంలోని మున్నూరుకాపు కార్యాలయంలో జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బిసి సంఘాల నాయకులు మాట్లాడుతూ బిసి కులాలకు సంబంధించిన జనాభా లెక్కలు లేకపోవడం వల్ల విద్య, వైద్య, ఉద్యోగ తదితర రంగాలలో రిజర్వేషన్లు కల్పించక ఆర్థికంగా, సామాజికంగా బిసి కులాలు తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. 2027లో చేపట్టే జన గణనలో బిసి ఉపకులాలకు సంబంధించిన ప్రత్యేక కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో దేశ వ్యాప్తంగా అన్ని పార్టీల ప్రజాప్రతినిధులను కలిసి పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శింగు నర్సింహారావు, జిల్లా అధ్యక్షులు మేకల శ్రీనివాసరావు, బిసి జేవిసి ఛైర్మన్ పాల్వంచ రామారావు, వివిధ సంఘాల నాయకులు పెళ్లూరి విజయ్‌కుమార్, పెరుగు వెంకటరమణ, సిహెచ్ రమేష్, తాటి నిర్మల, తమ్మిశెట్టి వెంకటరాజు, కత్తి నెహ్రూ గౌడ్, లిక్కి కృష్ణారావు, సుంకర శ్రీనివాస్, లింగబోయిన పుల్లారావు, రావుల హన్మంతరావు, గాదె లక్ష్మి నారాయణ, చేతుల నాగేశ్వరరావు, పగడాల అనంతరాములు, టి. పోతురాజు పాల్గొన్నారు.


వెరాలో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమం



ప్రజాపక్షం/వైరా : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమంలో భాగంగా వైరా మున్సిపాలిటీ 5వ వార్డులో బిఆర్ఎస్ నాయకుడు కట్టా కృష్ణార్జున్‌రావు ఆధ్వర్యంలో ఓటు నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఈసందర్భంగా కట్టా కృష్ణార్జున్‌రావు మాట్లాడుతు శాసనమండలిలో విద్యావంతుల అభిప్రాయాలు, నిరుద్యోగ యువత సమస్యలు, ఉద్యోగుల హక్కులు, విద్యారంగానికి సంబంధించిన అంశాలు చర్చకు వచ్చేలా పట్టభద్రుల ప్రాతినిద్యం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలని అన్నారు. ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకూడదని తెలిపారు. యువత కేవలం ఉద్యోగ అవకాశాలకోసమే కాకుండా సమాజ అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణలోనూ చురుగ్గా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వార్డులో పట్టభద్రులను గుర్తించి నమోదు ప్రక్రియలో సహకారం అందించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నూకల ప్రసాదరావు, కొల్లా రాంబాబు, కొణతాలపల్లి సుజిత్, ఏలూరు నరసింహారావు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ రంగంపై ఏఐ ప్రభావం..!

-ఉద్యోగులకు కొత్త సవాళ్లు
-మారుతున్న టెక్నాలజీతో ఉద్యోగ భద్రతపై ఆందోళన
-భవిష్యత్తు కోసం నైపుణ్యాలే ఆయుధం
-ఏఐతో ఉద్యోగాల కోతకు అవకాశం





ప్రజాపక్షం/ తల్లాడ : సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) సాఫ్ట్‌వేర్ రంగంలో కీలక మార్పులకు కారణమవుతుంది. గతంలో గంటల తరబడి చేయాల్సిన పనులను ఏఐ సాధనాలు నిమిషాల్లోనే పూర్తి చేస్తుండడంతో ఐటి ఉద్యోగుల్లో ఆందోళన పెరుగుతుంది. ముఖ్యంగా కోడింగ్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, డేటా ప్రాసెసింగ్, కస్టమర్ సపోర్ట్ వంటి విభాగాల్లో కొన్ని సాధారణ పనులను ఏఐ సులభతరం చేస్తుంది. దీంతో కొన్ని ఉద్యోగాల అవసరం తగ్గే అవకాశం ఉండగా మరికొన్ని ఉద్యోగాల స్వరూపం పూర్తిగా మారుతుంది. సాఫ్ట్‌వేర్ రంగంలోకి అడుగుపెట్టాలనుకునే యువతకు ప్రస్తుతం నైపుణ్యాలు, అనుభవం కీలకంగా మారుతున్నాయి. గతంలో ప్రారంభ స్థాయి ఉద్యోగులకు అప్పగించే కొన్ని పనులను ఇప్పుడు ఏఐ సహాయంతో అనుభవజ్ఞులైన ఉద్యోగులే వేగంగా పూర్తి చేయగలుగుతున్నారు. దీంతో కొన్ని సంస్థలు ప్రెషర్ల నియామకాల్లో మరింత జాగ్రత్తగా వ్యవహరించే అవకాశం ఉంది. అయితే కొన్ని కంపెనీలు నియామకాలను నిలిపివేశాయని ఏఐ వల్ల భారీ స్థాయిలో ఉద్యోగాలన్ని కనుమరుగవుతాయని చెప్పవచ్చు. ఏఐ అమలు వేగం, కంపెనీల వ్యాపార అవసరాలు, ఉద్యోగుల నైపుణ్యాల ఆధారంగా ప్రభావం మారుతుంది. ఏఐ కారణంగా కొన్ని సంప్రదాయ ఉద్యోగాలు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ ఏఐ అప్లికేషన్ డెవలప్‌మెంట్, డేటా ఇంజనీరింగ్, సైబర్ సెక్యూరిటీ కోడ్, కంప్యూటింగ్ ఏఐ మోడళ్ల నిర్వహణ, నాణ్యత పరీక్షలు వంటి రంగాల్లో కొత్త అవకాశాలు కూడా ఏర్పడుతున్నాయి. అయితే కొత్త ఉద్యోగాలు పాత ఉద్యోగాలను అదే సంఖ్యలో, అదే సమయంలో భర్తీ చేస్తామని లేదు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోకపోతే ఉద్యోగ పోటీ మరింత కఠినంగా మారే ప్రమాదం ఉంది. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న యువత కేవలం సర్టిఫికేట్లకే పరిమితం కాకుండా ప్రాక్టికల్ పరిజ్ఞానంపై దృష్టి పెట్టాలి. ప్రోగ్రామింగ్ ప్రాథమిక అంశాలు, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, డేటా విశ్లేషణ, ఏఐ సాధనాల వినియోగం, సైబర్ సెక్యూరిటీ వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి. తమ రంగానికి అనుగుణంగా ఏఐ సాధనాలను ఉపయోగించడం నేర్చుకోవాలి. ప్రాజెక్టులు రూపొందించడం, ఇంటర్న్‌షిప్ లు చేయడం, గిట్‌హబ్ వంటి వేదికల్లో తమ పనిని ప్రదర్శించడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపర్చుకోవచ్చు. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వారు కూడా కొత్త సాంకేతికతను నేర్చుకోవడంతో పాటు తమ రంగంలో లోతైన అవగాహన, కమ్యూనికేషన్ నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాలను పెంచుకోవాలి. ఏఐ ఇచ్చిన ఫలితాలను పరిశీలించి తప్పులను గుర్తించడం, భద్రతా ప్రమాణాలను పాటించడం వంటి నైపుణ్యాలు కూడా కీలకంగా మారనున్నాయి.

మార్పులకు సిద్ధమైతేనే భవిష్యత్తుకు భరోసా :

ఏఐని ఉద్యోగాలకు శత్రువుగా మాత్రమే కాకుండా పనితీరును మెరుగుపరిచే సాధనంగా ఉపయోగించుకోవడం అవసరం. అదే సమయంలో ఉద్యోగాల మార్పు వల్ల ఇబ్బందులు ఎదుర్కొనే వారికి నైపుణ్య విక్షణ, పునఃశిక్షణ అవకాశాలు అందించడం సంస్థలు, విద్యా సంస్థలు, ప్రభుత్వాల బాధ్యత రాబోయే రోజుల్లో సాఫ్ట్‌వేర్ రంగంలో నిలదొక్కుకోవాలంటే డిగ్రీతో పాటు నిరంతర అభ్యాసం, సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యం తప్పనిసరి కానున్నాయి. ఏఐతో పోటీ పడటం కంటే ఏఐని సమర్థంగా ఉపయోగించగల నైపుణ్యాన్ని పెంచుకోవడమే యువత ముందున్న ప్రధాన మార్గం. ప్రపంచ ఆర్థిక వేదిక 2025 ప్రకారం 2023 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 17 కోట్ల కొత్త ఉద్యోగాలు ఏర్పడవచ్చని 9.2 కోట్ల ప్రస్తుత ఉద్యోగాలు కనుమరుగవచ్చని అంచనా. ఇది ఏఐ ఒక్కటి వల్ల కాదు. అనేక సాంకేతిక, ఆర్థిక పరిణామాల ప్రభావం కూడా ఉంటుంది.

ఇల్లందును కరువు మండలంగా ప్రకటించాలి



ప్రజాపక్షం/ఇల్లందు: ఇల్లందు మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని, మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ లీకేజీతో నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పైప్‌లైన్‌ను జనావాసాలు, వ్యాపార ప్రాంతాల నుంచి తొలగించి పట్టణం వెలుపలికి మార్చాలని కోరారు. ఆదివారం ఏలూరి లక్ష్మీనారాయణ భవన్‌లో మన్యం మోహన్ రావు అధ్యక్షతన జరిగిన సీపీఎం ఇల్లందు మండల విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా నాయకులు అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్ మాట్లాడుతూ సాగునీటి వనరులతో మూడు పంటలు పండే మండలాలను, మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాలను కరువు మండలాలుగా ప్రకటించి, వర్షాధార వ్యవసాయంపై ఆధారపడే గిరిజన మండలమైన ఇల్లందును విస్మరించడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇల్లందును కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. జనావాసాలు, వాణిజ్య ప్రాంతాల మధ్య పైప్‌లైన్ వేయడం అశాస్త్రీయమని అప్పట్లో సీపీఎం వ్యతిరేకించినా పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. ఈకార్యక్రమంలో సుల్తానా, ఆలేటి సంధ్య, మునిగంటి లక్ష్మీ, కల్లేపల్లి మరియా, షేక్ ఖాదర్, మాదారపు వెంకటేశ్వర్లు, సర్వన్ కుమార్, కొడేం బోస్, వాసం రాము, ఈసం వెంకటమ్మ, సోమ సుజాత, కోరం సరోజ, మహమూద్, సత్యనారాయణ కోరి, తాండ్ర కాంత, మన్యం మమత, జీ ఉమాదేవి, కడారి వెంకటమ్మ, రేష్మా, పల్లి సుజాత, కోటమ్మ, వైకుంఠం, సలీమ, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ బచావో-దేశ్ బచావో నినాదంతో ప్రజాస్వామ్య పరిరక్షణ



ప్రజాపక్షం/మణుగూరుః ఓట్ బచావో దేశ్ బచావో" (ఓటును కాపాడండి దేశాన్ని కాపాడండి) అనే నినాదంతో ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కుల సంరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం న్యూఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో నిర్వహిస్తున్న భారీ నిరసన కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న లతో కలిసి పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వ్యతిరేకిస్తూ, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించకుండా చూడాలని, ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును పరిరక్షించాలని కాంగ్రెస్ పార్టీ ఈ నిరసన కార్యక్రమం ద్వారా డిమాండ్ చేస్తోంది. అదే విధంగా, ఎన్నికల సంఘం పని తీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా నాయకులు తమ నిరసనను తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ తదితరుల పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వివిధ ప్రతిపక్ష పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల సంరక్షణ, ప్రతి ఓటరు హక్కు కాపాడాలనే డిమాండ్లతో తమ గళాన్ని వినిపిస్తున్నారు.

పర్ణశాలలో వైభవంగా పునర్వసు కళ్యాణం



ప్రజాపక్షం/దుమ్ముగూడెం: పర్ణశాల దేవస్థానంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా శ్రీస్వామి వారి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఎస్ కిరణ్ కుమార్, భార్గవా చార్యులు, నరసింహాచార్యులు, భాస్కరాచార్యులు వేదమంత్రాల నడుమ కళ్యాణ క్రతువును నిర్వహించారు. దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ బి వాసు కార్యక్రమ ఏర్పాట్లలో పాల్గొన్నారు. భక్తులు కళ్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వీక్షించారు.

కారేపల్లిలో పర్యటించిన మాజీ ఎంఎల్ఏ



ప్రజాపక్షం/కారేపల్లి: వైరా నియోజకవర్గ మాజీ ఎంఎల్ఏ లావుడియా రాములు నాయక్ ఆదివారం కారేపల్లి మండలంలో పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. తొలుత ఉసిరికాయలపల్లిలోని కోటమైసమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ పర్స పట్టాభి రామారావు ఆయనకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆలయ అర్చకులు కైలాస శర్మ కుమారుడు శంకర్ శర్మ, శరణ్య నూతన దంపతులను రాములు నాయక్ ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. మండల కేంద్రంలో ఉపాధ్యాయుడు కేలోత్ నరేష్ నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశ వేడుకకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లావుడియా వాగ్య నాయక్ నివాసంలో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. గృహ ప్రవేశానికి వచ్చిన ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులతో ముచ్చటించారు. ఈకార్యక్రమాల్లో నాయకులు అజ్మీర వీరన్న, జాల సాంబ, దారావత్ రాంజీ, భూక్య రాంకిషోర్, గుగులోత్ సురేష్, జర్పుల చందర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు భూక్య శ్యామ్‌లాల్, మాలోత్ ప్రతాప్ సింగ్, గుగులోతు రవీందర్ నాయక్, అజ్మీర వీరు నాయక్, రాజు నాయక్, బానోత్ మంగీలాల్ నాయక్, కేలోత్ రాములు నాయక్, టీడీపీ నాయకులు వాంకుడోత్ మాత్రు, వాంకుడోత్ లక్ష్మణ్, అంగోత్ శంకర్, వార్డు సభ్యుడు భూక్య కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయురాలు సావిత్రి



ప్రజాపక్షం/కారేపల్లి: విద్యార్థులనే తన బిడ్డలుగా భావించి, వారి అభ్యున్నతికి అంకితభావంతో పని చేసిన కారేపల్లి తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల మాజీ ప్రిన్సిపల్ దారా సావిత్రి అకాల మరణం విద్యారంగానికి తీరని లోటని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సావిత్రి సంతాప సభను ఆదివారం ఖమ్మం ఆర్టీసీ కాలనీలోని వంశీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆలస్యంగా సంతానం కలిగినా పాఠశాల విద్యార్థులందరినీ తన బిడ్డలుగా భావించి ఆప్యాయంగా చూసుకునేవారని గుర్తు చేశారు. ఉపాధ్యాయ వృత్తిని ఉద్యోగంగా కాక బాధ్యతగా భావించి, క్రమశిక్షణతో విద్యార్థుల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఆమెతో పని చేసిన ఉపాధ్యాయులు తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. సావిత్రికి ఘన నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో మృతురాలి భర్త ఉపేందర్, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు షేక్ గౌసుద్దీన్, ఖలీల్ ఉల్లాఖాన్, సీనియర్ జర్నలిస్ట్ పగడాల నాగేశ్వరరావు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, తోట ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, బంధువులు, తదితరులు పాల్గొన్నారు.

కొమరం భీమ్ త్యాగం చిరస్మరణీయం



ప్రజాపక్షం/ఇల్లందు: ఆదివాసీల హక్కులు, భూమి, స్వయం పాలన కోసం పోరాడిన కొమరం భీమ్ త్యాగం చిరస్మరణీయమని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం నరసింహారావు అన్నారు. సుభాష్‌నగర్ కరెంట్ ఆఫీస్ సెంటర్‌లో తుడుందెబ్బ ఆధ్వర్యంలో కొమరం భీమ్ 86వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆదివాసీ ఉద్యమ నాయకులు ఆయనకు నివాళులర్పించారు. ఈసందర్భంగా ఈసం నరసింహారావు మాట్లాడుతూ నిజాం సైన్యానికి వ్యతిరేకంగా గెరిల్లా పోరాటం సాగించి ఆదివాసీల భూములు, హక్కుల పరిరక్షణ కోసం కొమరం భీమ్ ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. ఆయన పోరాట స్ఫూర్తితోనే ఆదివాసీ హక్కుల సాధనకు మార్గం ఏర్పడిందని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అమలవుతున్న 1/70 చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టాల ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తూ, ప్రతి ఆదివాసీ కొమరం భీమ్ పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జార కృష్ణ, మహిళా నాయకురాలు వాసం రాములమ్మ, జిల్లా నాయకుడు జోగ రమేష్, మండల నాయకులు సనప కృష్ణమూర్తి, లింగాల సాంబయ్య, ఈసం అనిల్, ఆలం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

ప్రజాపక్షం/ఇల్లందు: రాబోయే ఎంఎల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బోనోత్ హరిసింగ్ నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఇల్లందు పట్టణ ఇన్‌చార్జి సిలివేరి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఇల్లందు పట్టణంలోని 16వ వార్డులో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి అర్హులైన పట్టభద్రులను వారు వ్యక్తిగతంగా కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం తమ పేర్లను నమోదు చేసుకోవాలని, నిర్లక్ష్యం చేయకుండా ఎంఎల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాపోలు కిరణ్, బజారు సత్యనారాయన, యువజన నాయకులు గిన్నారపు రాజేష్, చాందా పాషా, సత్తా లహరికృష్ణ, కొంటూ రవికాంత్, హరి ప్రసాద్ యాదవ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అడవి బతుకులు..ఇంకా అభివృద్ధికి దూరమే..!

-కొత్తగుంపులో 23 గొత్తి కోయ కుటుంబాలకు కనీస వసతులు కరువు
-రహదారి లేక వైద్యానికి అవస్థలు
-అంగన్‌వాడీ, గిరిజన ధ్రువపత్రాలు, పోడు పట్టాలూ లేవు
-ఏళ్లుగా అధికారులకు విన్నవించినా పరిష్కరించడం లేదని గిరిజనుల ఆవేదన







ప్రజాపక్షం/దుమ్ముగూడెం: అడవినే నమ్ముకొని జీవిస్తున్న 23 గొత్తికోయ కుటుంబాలకు కనీస మౌలిక వసతులు అందటం లేదు. వర్షాకాలంలో గ్రామం నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి. అనారోగ్యమొస్తే ఆసుపత్రికి చేరుకోవడే ప్రాణసంకటంగా మారుతోంది. పిల్లలు చదువుకోవాలంటే విషసర్పాలు, వన్య మృగాలు సంచరించే అటవీ మార్గంలో ప్రయాణించాల్సి వస్తోంది. ఇదీ దుమ్ము గూడెం మండలం పైడిగూడెం గ్రామ పంచాయితీ పరిధిలోని కొత్తగుంపు గ్రామం దుస్థితి. ములకనపల్లి నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామంలో 23 గొత్తికోయ కుటుంబాలు ఏళ్లుగా నివసిస్తున్నాయి. అందరికీ తెల్ల రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు ఉన్నప్ప టికీ కనీస సదుపాయాలు అందడం లేదని, పలుమార్లు అధికారులకు విన్నవిం చినా సమస్యలు పరిష్కారం కాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రహదారి లేక వైద్యానికి అవస్థలు...

గ్రామానికి ప్రధాన రహదారి లేక వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోతు న్నాయి. అత్యవసర అనారోగ్య పరిస్థితుల్లో సకాలంలో ఆసుపత్రికి చేరుకోలేక గతంలో పలువురు మృతి చెందిన ఘటనలు ఉన్నాయని గ్రామస్తులు చెబుతు న్నారు. వైద్య సిబ్బంది అప్పుడప్పుడు మాత్రమే వస్తున్నారని, నిరంతర వైద్య సేవలు అందడం లేదని వాపోతున్నారు.

చిన్నారులకు అంగన్‌వాడీ కరువు

గ్రామంలో సుమారు పది మంది చిన్నారులున్నా అంగన్‌వాడీ కేంద్రం లేదు. పాఠశాల విద్య కోసం పిల్లలు ములకనపల్లికి వెళ్లాల్సి వస్తోంది. మధ్యలోని అటవీ మార్గంలో విషసర్పాలు, వన్యమృగాల సంచారాంతో పిల్లలను పంపేం దుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. గ్రామంలోనే అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ధ్రువపత్రాలు లేక యువతకు అవకాశాలు దూరం

గ్రామంలో ఇంటర్, డిగ్రీ వరకు చదువుకున్న ఐదు గురు యువకులు ఉన్న ప్పటికీ గిరిజన కుల ధ్రువపత్రాదలు అందక ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల అవకాశాలు కోల్పోతున్నామని ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన వారికి ధ్రువప త్రాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పోడు భూములే జీవనాధారం

గ్రామ పరిసరాల్లోని పోడు భూముల్లో వరి, పత్తి, పెసలు, కంది, మినుములు, నువ్వులు సాగు చేస్తున్నారు. అటవీ ఫలాలు, తేనె, ఇప్పపువ్వు సేకరణతో పాటు పశువులు, మేకలు, పందులు, పావురాల పెంపకం ద్వారా జీవనం సాధిస్తు న్నారు. ఈ ఏడాది పంటలు దెబ్బతినడంతో ఇబ్బందులు పెరిగాయని, సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతున్నారు.

పోలీసుల చొరవతో విద్యుత్, తాగునీరు

గతంలో పోలీసు అధికారులు గ్రామాన్ని సందర్శించి నిత్యావసర సరుకులు, దుప్పట్లు, వంట సామగ్రి, పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారని గ్రామ స్తులు గుర్తు చేశారు. వారి చొరవతో సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్, సోలార్ విద్యు త్‌తో పని చేసే బోరు మోటార్ ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించారని తెలిపారు. అయితే త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం లేదని, పారిశుద్ధ్య పనులు సక్ర మంగా జరగక వ్యాధులు వ్యాపిస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు కాలేదని వాపోయారు.





వర్షాకాలం వస్తే మమ్మల్ని పట్టించుకునేవారే లేదు..

కొత్తగుంపు పటేల్ భార్య మడకం పూసమ్మ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఇక్కడే జీవిస్తున్నాం. వర్షాకాలంలో గ్రామం నుంచి బయటకు వెళ్లలేకపోతున్నాం, ఈ ఏడాది పంటలు దెబ్బతిన్నాయి. పిల్లలు అడవి మార్గంలో పాఠశాలకు వెళ్లాలంటే సర్పాలు, అడవి జంతువుల భయంతో ఆందోళనగా ఉంది. అధికారులు ఇప్పటి కైనా కనీస వసతులు కల్పించాలని కోరారు. అదే విధంగా గొత్తికోయ గిరిజనుడు మడకం సోను మాట్లాడుతూ నేను భద్రాచలంలో ఇంటర్ వరకు చదువుకు న్నారు. గిరిజన ధ్రువపత్రాలు అందక ఉన్నత చదువులు కొనసాగించలేకపో యాను, మా గ్రామంలో ఇంటర్, డిగ్రీ చదివిన వారు ఐదుగురు ఉన్నారు. ధ్రువ పత్రాలు ఉంటే మరింత చదువుకొని ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశం ఉండేది. గ్రామానికి రహదారి, అంగన్‌వాడీ కేంద్రం కల్పించి, పోడు భూము లకు పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

రహదారి, వైద్య సేవలు, అంగన్‌వాడీ, గిరిజన ధ్రువపత్రాలు, పారిశుద్ధ్యం, ఇందిరమ్మ ఇళ్లు, త్రీఫేస్ విద్యుత్, పోడు పట్టాల సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు గ్రామాన్ని సందర్శించి సమగ్ర పరిశీలన జరపాలని 23 కుటుం బాలు కోరుతున్నాయి. అటవీ ప్రాంతంలో నివసిస్తున్నామనే కారణంతో అభివృ ద్ధికి దూరం చేయవద్దని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

సర్పంచ్ స్థాయి నుండి మంత్రిగా ఎదిగిన నేత వనమా

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం ; సర్పంచ్ స్థాయి అనేక ఓటు పోట్లకు ఎదురొడ్డి మంత్రి స్థాయి దాకా ఎదిగిన మచ్చలేని నేత మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. వనమా జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పాల్వంచ లో జరిగిన వేడుకకు అజయ్ హాజరై వనమాకు 82వ జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ తన తండ్రి పువ్వాడ నాగేశ్వరరావుకు రాజకీయ సమకాలికులు వమా అని చెప్పుకొచ్చారు. వారిద్దరూ కూనవరం మండలానికి చెందిన వారే అని గోదావరి నీళ్లు తాగిన మనుష్యులే అన్నారు. వనమ తన ఇన్నేళ్ల రాజ కీయ జీవితంలో మచ్చలేకుండా పనిచేశారని, సుదీర్ఘ కాలం పాటు కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఆయన జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పాటుపడ్డారని, తాను ప్రాతినిధ్యం వహించే ప్రాంతాభివృద్ధికే కృషి చేశారని చెప్పారు. రాజకీయ పరిణామాల దృష్ట్యా బిఆర్ఎస్‌లో చేరినప్పటికీ నిస్వార్థంగా నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు పనిచేశారని తెలిపారు. వనమా కుటుంబానికి తాను ఎప్పటికీ అండగా ఉంటానని చెబుతూనే ఇదే తరహాలో ఉంటూ పలువురికి ఆదర్శంగా ఉండాలని, నిండునూరేళ్లు ఆరోగ్యంతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్‌జేసి కృష్ణ బచ్చు విజయ్ కుమార్ బొమ్మెర రామ్మూర్తి పిన్ని కోటేశ్వరరావు మనీషా లక్ష్మీ బోను మాటేటి కిరణ్ మోరంపూడి సాయి తోట కనకారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన అమరవీరుల సంస్మరణ సభలు



ప్రజాపక్షం/జూలూరుపాడు: నవంబర్ 1 నుండి 10 వరకు గ్రామ గ్రామాన అమరవీ రుల సంస్మరణ సభలు జరపమని సిపిఐ (ఎం ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపు లోభా గంగా ఆదివారం జూలూరుపాడు మండల కేంద్రంలోని అన్నారప్పాడు గ్రామంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఈ సభకు ధనమంతరావు మండల నాయకులు అధ్యక్షత వహించగా సిపిఐ (ఎం ఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు బానోతు ధర్మ పాల్గొని వారు మాట్లా డుతూ దేశం లోనే పీడిత ప్రజల కోసం తినటానికి తిండి, ఉండటానికి ఇల్లు, కట్టుకోవటానికి బట్ట పేద ప్రజల కోసం దోపిడీ రహిత సమా జాన్ని నిర్మించాలని లక్ష్యంతో తమ అమూల్యమైన లక్ష్యాలను విడిచి పేద ప్రజల కోసం పోరాడి అసువులు బాసిన ఎంతోమంది అమరవీరులను స్మరించుకొని నివాళి అర్పించి,అమరవీరులు చూపిన బాటలో మనమందరం పయనించాలని వారి ఆశయ సాధన కోసం ఎర్రజెండాను మన భుజ స్కందాలపై ఉన్నదని, అమరవీరులు సాధించి పెట్టిన హక్కులను కాపాడుకో కొనుటకు సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా నిర్వహిస్తున్న రాజీలేని పోరాటంలో అశేష ప్రజానీకం మమేకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో మండల నాయకులు తోటకూరి నరేష్ ధనవంతురావు, గూగు లోలోత్ ల్లింగ, గ్రామ శాఖ కార్యదర్శి భానోతు ఈరు, గ్రామ కార్యక ర్తలు దశరథ్, బాబు కైలా సర్దార్, కృష్ణ, సురేష్, నరసింహ, సోమల వెంకట్రావు, సేవ, కాంతి, అనూష తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి గిరిజన దర్బార్

ప్రజాపక్షం/భద్రాచలం ; జిల్లాలోని ఐడిఓసిలో ప్రజావాణి, భద్రాచలం ఐటిడిఏ సమావేశం మందిరంలో గిరిజన దర్బార్ నిర్వహించనున్నట్లు ఆయా కార్యాలయాల పరిపాలనాధికారులు తెలిపారు. ప్రజలు వారి వారి సమస్యలపై వినతులు చేసుకునేందుకు నేరుగా కార్యాలయాలకు చేరుకుని అధికారులకు వినతి పత్రాలు అందిచవచ్చని చెప్పారు. ఆయాశాఖల అధికారులంతా సకాలంలో హాజరు కావాలన్నారు

ఆళ్లపల్లిలో మెగా ఉచిత వైద్య శిబిరం



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఆళ్లపల్లి మండల కేంద్రంలో కొత్తగూడెంలోని న్యూలైఫ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ యూరాలజీ వైద్య నిపుణులు డాక్టర్ గారపాటి పునీత్, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు డాక్టర్ దుద్దుకూరి అఖిల్ వైద్య సేవలు అందిం చారు. శిబిరంలో మధుమేహం, కిడ్నీ, గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి నిర్వహణ ప్రతినిధి భాగం మాధవరావు, గ్రామ సర్పంచ్ వాసం సుస్మిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్, సీపీఐ జిల్లా నాయ కుడు, మాజీ ఎంపీటీసీ రేసు ఎల్లయ్య, సీపీఐ మండల కార్యదర్శి కొమరం హనుమంతు, మండల సహాయ కార్యదర్శి నరెడ్ల రాంబాబు, ఆసుపత్రి సిబ్బంది, ఆళ్లపల్లి గ్రామీణ వైద్యులు ఎండి నయీం, యాసారపు కళ్యాణ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కారు ఆటో ఢీ

-నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాపక్షం/దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలం నల్లబెల్లి సమీపంలోని ప్రధాన రహ దారిపై ఆదివారం కారు, ఆటో ఢీకొన్ని ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం భద్రాచలం నుంచి పర్ణశాలకు వెళ్తున్న కారు, ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటోలోని నలుగురు గాయప డగా, స్థానికులు వారిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందు కున్న దుమ్ముగూడెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దమ్మపేటలో గంజాయి కలకలం



- ఎనిమిది మంది అదుపులోకి..
-ఆరుగురికి డ్రగ్‌టెస్టులో పాజిటివ్
- మరో ఇద్దరి వద్ద పావు కిలో గంజాయి స్వాధీనం

ప్రజాపక్షం/ అశ్వారావుపేట ః భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో గంజాయి వినియోగం, అక్రమ నిల్వపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో గంజాయి సేవిస్తున్న 6గురిని గుర్తించడంతో పాటు, మరో ఇద్దరి వద్ద పావుకిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మొత్తం 8మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. జిల్లా ఎస్పీ బి.రోహిత్‌రాజు ఆదేశాలు, పాల్వంచ డిఎస్పీ ఆర్.సతీష్‌కుమార్ సూచనల మేరకు దమ్మపేట పోలీసులు మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అక్టోబర్ 31న దమ్మపేట ఎస్సై బి.రాజేకుమార్ తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఆర్లపెంట గ్రామ శివారులో స్మశాన వాటిక వద్ద గంజాయి సేవిస్తున్న6గురిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారికి నిర్వహించిన యూరిన్ డ్రగ్ పరీక్షల్లో టిహెచ్‌సి పాజిటివ్ నిర్ధారణ అయింది. విచారణలో భాగంగా లంకాలపల్లి చెందిన పొట్ట సాయికుమార్ అలియాస్ సాయి, నాగుపల్లికి చెందిన లావుడియా చైతన్య వద్ద గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారి నుంచి సుమారు పావుకిలో గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.12,500 ఉంటుందని పోలీసులు వెల్లడించారు. అనంతరం 8మందిని దమ్మపేట కోర్టులో హాజరుపర్చగా కోర్టు ఆదేశాల మేరకు గంజాయి సేవించిన 6గురిని డీ అడిక్షన్ కేంద్రానికి తరలించారు. గంజాయి కలిగి ఉన్న మరో ఇద్దరిని రిమాండ్‌కు పంపించారు. గంజాయి సరఫరా, విక్రయాల వెనుక ఉన్న ఇతర వ్యక్తుల వివరాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులు యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యంతో పాటు భవిష్యత్‌ను కూడా నాశనం చేస్తుందని హెచ్చరించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, నిల్వ వినియోగానికి పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో అశ్వారావుపేట సిఐ నాగరాజు, దమ్మపేట ఎస్సై బి. రాజేష్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి



సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి

ప్రజాపక్షం/చింతకాని ః వర్షాభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయిన చింతకాని మండల రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జునరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరు గ్రామంలో సూపర్ ఎలినినో ప్రభావం వల్ల యాసంగిలో ఆరుతడి పంటలు వేయాలని వ్యవసాయశాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు మల్లిఖార్జున్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో చింతకానికి చోటు కల్పించకపోవడం వల్ల ఇక్కడి రైతులకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పంటల సాగు కోసం వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఇప్పటికే సాగు చేసిన పంటలకు ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే పరిస్థితి లేదని, మరోవైపు యాసంగి సాగు అగమ్యగోచరంగా ఉందని దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని పరిశీలించి చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకుని తగిన పరిహారం అందించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు సర్పంచ్ తుడుం కృష్ణయ్య, ఇరిగేషన్ అధికారి సందీప్, ఏఈవో తాహియా, పంచాయతీ కార్యదర్శి రజియా, రైతు సంఘం నాయకులు తాళ్లపల్లి అజయ్, గుర్రం శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల అండాల అక్రమ వ్యాపారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చంద్రావతి



ప్రజాపక్షం/వైరా : హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన మహిళల అండాల అక్రమ సేకరణ విక్రయ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేపట్టాలని మైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బి చంద్రావతి డిమాండ్ చేశారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు డబ్బు ఆశచూపి ఇతర రాష్ట్రాలనుంచి హైదరాబాద్‌కు తీసుకువచ్చి అండాల సేకరణకు వినియోగించుకుంటున్నారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. మహిళల ఆరోగ్యభద్రత, గౌరవానికి సంబంధించిన ఈ వ్యవహారంపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిగణించాలని కోరారు. అండాల సేకరణ ప్రక్రియ వైద్యపరంగా అత్యంత జాగ్రత్తతో నిర్వహించాల్సిన అంశమని హార్మోన్ ఇంజక్షన్‌లు అండాశయాలకు అధిక ప్రేరణ కారణంగా మహిళలకు తీవ్రమైన ఆరోగ్యసమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అన్నారు. సరైన పర్యవేక్షణ లేకుండా ఇటువంటి ప్రక్రియలు నిర్వహిస్తే మహిళల ప్రాణాలకే ముప్పువాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో మధ్యవర్తులు, సంబంధిత ఫెర్టిలిటీ కేంద్రాలు ఇతర పాత్రపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఐవిఎఫ్ కేంద్రాలు ఏఆర్‌టి బ్యాంకుల అనుమతులు, వైద్య రికార్డులు నిర్వహణ విధానాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని కోరారు. దర్యాప్తులో బాధ్యులుగా తేలినవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అడ్డుకట్ట వేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు.

కల్లూరులో కల్లాలు లేక కష్టాలు..!



ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు మండల పరిధిలోని ఖరీఫ్, రబీ లో పండిన ధాన్యం ఆరబోసుకునేందుకు కల్లాలు లేక రైతులు కష్టాలు పడుతున్నారు. రోడ్లను ఆధారంగా చేసుకొని ఆరబోసుకుంటున్నారు. కల్లూరు మండలంలో వరి ధాన్యం 33 వేల ఎకరాలలో వరి మిగతా ఎకరాలలో పత్తి , మిర్చి తదితర పంటలను 44 వేల మంది రైతులు పలు రకాల పంటలను కొనసాగిస్తూ ఉంటారు. పంటలను ఆరబోసుకునేందుకు గత ఐదు సంవత్సరాల క్రితం ఉపాధి హామీలో భాగంగా కల్లాలను రైతులకు ఏర్పాటు చేశారు. అవి నిరుపయోగంగా ఉపయోగంలో లేనందున శిథిలావస్థకు చేరినందున ఉపయోగం లేకుండా పోయాయి. దీనివలన రైతులకు కల్లాలు లేనందున రాకపోకలు చేస్తున్న బిటి రోడ్లపై ధాన్యం ఆరబోసుకొని కల్లాలుగా మార్చుకున్నారు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా కొనసాగుతూ వస్తున్నది. దీనివలన రహదారులు ఇరుకుగా మారి వాహనదారులకు రాకపోకలు చేస్తున్న సమయంలో ఇబ్బందులు పడుతున్నట్టు వాహనదారులు తెలుపుతున్నారు. ప్రభుత్వం రైతులకు ఉచితంగా కల్లాలను ఏర్పాటు చేసి కష్టాలు లేకుండా చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మండల పరిధిలోని కల్లూరు టు మధిర రోడ్డు లో ఉన్న దారుక బంజర వరకు సుమారుగా 20 కిలోమీటర్ల వరకు రోడ్డు ఇరువైపులా రోడ్డును చేసేదేమీ లేక కల్లాలుగా రైతులు మార్చుకుంటున్నారు. మండల పరిధిలోని జిడిపి పల్లి, వాచ్యనాయక్ తండ, లింగాల, ఎర్ర బోయినపల్లి, చెన్నూరు, లింగాల, పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి తోపాటు ముచ్చవరం, పాయపూర్, బత్తులపల్లి, పేరువంచ తదితర గ్రామాలలో రహదారులను కల్లాలుగా ఉపయోగించుకుంటున్నారు. ప్రభుత్వం ఉచితంగా కల్లాలను నిర్మించి రైతులకు అంకితం చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు



ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు లోని మినీ స్టేడియంలో ఆదివారం అండర్ 14 అథ్లెటిక్స్ ఎంపికలు ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి కార్యక్రమం జరిగింది. ఈ పోటీలకు 250 మంది బాల బాలికలు హాజరైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైన వారిని ఈనెల 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి పోటీలు హన్మకొండలో జరిగే పోటీలకు హాజరవుతారని పీఈటీలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో వ్యాయామ ఉపాధ్యాయులు తో పాటు విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలో ధర్నా



ప్రజాపక్షం/పెనుబల్లిః ఢిల్లీ వేదికగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధి నాయకత్వంలో ఆదివారం జరిగిన ఓటు చోరీకి వ్యతిరేకంగా జరిగిన ర్యాలీలో పెనుబల్లి మండలం నుండి పలువురు నాయకులు పాల్గొన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, వరంగల్ జిల్లా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ సత్తుపల్లి డివిజన్ అధ్యక్షులు పసుమర్తి విశ్వనాధ్ పాల్గొన్నారు. ఈ ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి డప్పు వాయిస్తూ ఓటు చోరీకి వ్యతిరేకంగా పాట పాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటానికి తన గళాన్ని వినిపించారు. ఓటు చోరీతో అధికారంలోకి వచ్చారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజేపి ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

జాతీయ కరాటే పోటీల్లో మిరాకిల్ మైండ్స్ విద్యార్థుల ప్రతిభ



ప్రజాపక్షం/సత్తుపల్లిః ఖమ్మం పట్టణంలో ఆదివారం నిర్వహించిన 32వ జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్2026 పోటీల్లో సత్తుపల్లి మిరాకిల్ మైండ్స్ ది స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు పతకాలు సాధించారు. సుమన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటేడో అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో పి. దేవి దరహాస్ ప్రథమ, టి. బిందు భార్గవ్ ద్వితీయ స్థానాలు సాధించగా, ఎస్. సాయి జోషిక్, ఎస్. మణితేజ్ కుమార్, ఎం. చార్లెస్ సూర్య తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. విద్యార్థుల విజయంపై పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ రత్నాకర్ మొండ్రు హర్షం వ్యక్తం చేస్తూ విజేతలను, వారికి శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ పవన్, క్రీడా ఉపాధ్యాయులు మురళి, కళ్యాణ్‌లను అభినందించారు. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నామని ఆయన తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు వేగవంతం చేయాలి



ప్రజాపక్షం/సత్తుపల్లిః ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. నమోదు ప్రక్రియలో సమస్యలు ఎదురైతే పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సంప్రదించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో వార్డు కౌన్సిలర్లు కూసంపూడి మహేష్, బెల్లంకొండ రాము, బీఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

20వ వార్డులో స్మశానవాటికలో నూతన బోరు పంపు



ప్రజాపక్షం/వైరా : వైరా మున్సిపాలిటీ పరిదిలోని 20వ వారు శాంతినగర్ శ్మశానవాటికలో నీటి సౌకర్యం కల్పించేందుకు నూతన బోర్ పంపు ఏర్పాటు పనులకు వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాం బాబు ప్రత్యేక చొరవతో పనులకు శ్రీకారం చుట్టారు. శాంతినగర్ శ్మశానవాటికలో అంత్యక్రియల సమయంలో నీటి సౌకర్యంలేక స్థానిక ప్రజలు చాలాకాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈసమస్యను వార్డు నాయకులు కౌన్సిలర్ ఉండ్రువరలక్ష్మి శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, మున్సిపల్ కమీషనర్, మున్సిపల్ ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు సానుకూలంగా స్పందించి బోరుపంపు ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, డీసీసీ హెల్త్ సెల్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు నూతన బోరు పంపు వల్ల 20వవార్డు ప్రజలకు శ్మశానవాటికలో జరిగే దహనసంస్కారాలకు నీటి ఇబ్బందులు తొలుగుతాయని అన్నారు. వార్డు ప్రజలు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, 7వ వార్డు కౌన్సిలర్ పణితి సైదులు, రత్నాకర్, విప్పలమడక మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణార్జున్‌రావు, కాంగ్రేస్ సీనియర్ నాయకులు పొదిళ్ల హరినాథ్, ఎదునూరి సీతారాములు, మాజీ కౌన్సిలర్ లక్ష్మీ బాయి, రాజారావు, వార్డు నాయకులు వాంకుడోత్ భిక్యా, పువ్వాళ్ల రాము, ఎస్‌కె రహీం(పండు), నాగేశ్వరరావు, ఎస్‌కె సలీం, దర్గయ్య, రాము, బాలమ్మ, నాగమణి, ముస్తఫా, సాయి, తంబి, గోపి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

చిరునోములలో ఆగని అక్రమ ఎర్రమట్టి దందా..!

-అధికారులకు సమాచామిచ్చినా ఆగని రవాణా
-అసైన్డ్ భూముల నుంచి యథేచ్ఛగా తరలింపు
-సెలవు రోజును ఆసరాగా చేసుకొని జోరుగా తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు..
-ప్రభుత్వ ఆదాయానికి గండి ?





ప్రజాపక్షం/బోనకల్: మండలంలోని చిరునోముల గ్రామంలో ఎర్ర మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వెల్లు వెత్తున్నాయి. ముఖ్యంగా ఆదివారం సెలవు దినాన్ని ఆసరాగా చేసుకొని జెసిబిలతో అసైన్డ్ భూముల నుంచి ఎర్రమట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఈ వ్యవహారం కొనసాగుతున్నా సంబంధిత అధికా రులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆది వారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు మట్టి తవ్వకాలు, రవాణా కొనసాగినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఎలాంటి అనుమతులు కొనసాగినట్లు గ్రామస్తులు చెబుతు న్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారని, దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడ టంతో పాటు గ్రామీణ రహదారులపై దుమ్ము, ధూళితో ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు సమా చారం అందించినప్పటికీ ట్రాక్టర్ల రాకపోకలు ఆగకపోవడం పలు అను మానాలకు తావిస్తోందని పేర్కొంటున్నారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల పరిరక్షణ బాధ్యత రెవెన్యూ అధికారులదే అయినప్పటికీ పర్య వేక్షణ కొరవడిందని స్థానికులు విమర్శిస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతుల లేకుండా ఇంత పెద్ద ఎత్తున మట్టి రవాణా ఎలా కొనసాగుతుందనే ప్రశ్నలు తలెత్తున్నాయి. సెలవు రోజుల్లోనే ఈ కార్య కలాపాలు మరింత జోరుగా సాగుతున్నాయని, అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

-అధికారులకు సమాచారం ఇచ్చినా ఆగని రవాణా..

చిరునోములలో ఎర్రమట్టి అక్రమ రవాణా జరుగుతున్న విషయాన్ని స్థానిక జిపిఓకు సమాచారం అందించగా, తాము రామాపురం భూసర్వే పనుల్లో ఉన్నామని, తహసీల్దార్‌కు తెలియజేయాలని సూచిం చినట్లు సమాచారం. అయినప్పటికీ మట్టి తరలింపు కొనసాగడంపై గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

-అనుమతులు ఇవ్వలేదు
చల్లూరి సుధాకర్, తహసీల్దార్.



ఈ విషయంపై బోనకల్ తహసీల్దార్ చల్లూరి సుధాకర్‌ను వివరణ కోరగా, ఎర్రమట్టి రవాణాకు ఎలాంటి అనుమ తులు ఇవ్వలేదని తెలిపారు. వెంటనే స్థానిక జిపిఓను పంపిస్తానని చెప్పారు. ట్రాక్టర్ల రవాణా కొనసాగుతున్న విష యాన్ని మరోసారి ఆయన దృష్టికి తీసుకె ళ్లగా, మట్టి తరలించే వారితో మాట్లాడా నని, వెంటనే ట్రాక్టర్లను నిలిపివేస్తారని పేర్కొన్నారు. అయితే అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ మట్టి రవాణా కొనసాగడంపై స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, అక్రమ తవ్వకాలు నిజమని తెలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వైద్యులు, ఆసుపత్రులపై అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు

-నిరాధార ఆరోపణలు, బెదిరింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు
-ఐఎంఏ ఖమ్మం జిల్లా శాఖ హెచ్చరిక



ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం: వైద్యులు, ఆసుపత్రులను లక్ష్యంగా చేసు కొని సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు, నిరాధార ఆరోపణలు, బెదిరిం పులకు పాల్పడితే క్రిమినల్, సివిల్, పరువు నష్టం కేసులు ఎదుర్కొవాల్సి వస్తుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐ ఎంఏ) ఖమ్మం జిల్లా శాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ప్రాణా లను కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తున్న వైద్యుల ప్రతిష్టను దెబ్బతిసే ప్రయత్నాలను సహించ బోమని స్పష్టం చేశారు. వైద్య నిర్లక్ష్యం నిర్ధారణ కాకముందే వైద్యులపై ఆరోపణలు చేయడం, ఆసుపత్రుల్లో గొడవలు సృష్టించడం, వైద్యసిబ్బందిని బెదిరించడం, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేయడం ఆందోళనకరమన్నారు. ఇలాంటి ఘటనల వల్ల అత్యవసర వైద్య సేవలకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది, ఆసుపత్రు లకు తగిన రక్షణ కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్, డిఎంహెచ్ఓ, ఏసిపీలకు ఐఎంఏ ఆధ్వ ర్యంలో వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఐఎంఏ లీగల్ సెల్, జిల్లా కార్యదర్శి డాక్టర్ ముక్కపాటి కోటేశ్వరరావు మాట్లాడుతూ వైద్యులపై అసత్య ఆరోపణలు, బెదిరింపులు, పరువుకు భంగం కలిగించే ప్రచారాలపై చట్టపరంగా పోరాడుతామని వెల్లడించారు. బాధిత వైద్యులు, ఆసుపత్రులకు లీగల్ సెల్ ద్వారా పూర్తి న్యాయ సహకారం అందిస్తామని తెలిపారు. అదే సమ యంలో వైద్య సేవలపై రోగులకు అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులు, వైద్య నియం త్రణ సంస్థలు లేదా న్యాయస్థానాలను ఆశ్రయించే హక్కు ఉందని స్పష్టం చేశారు. నిజమైన ఫిర్యాదులపై నిష్పాక్షిక విచారణఖు ఐఎంఏ సహకరిస్తుందని పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సామాజిక సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు ఏరియా సింగ రేణి రైల్వే సైడింగ్ కాంట్రా క్ట్ కార్మికుల సామాజిక సేవలు స్ఫూర్తిదాయకమని సింగరేణి డీజీఎం సివిల్ గరిమెళ్ల శివప్రసాద్ ప్ర శంసించారు. ఆదివారం మధ్యాహ్నం సంతోష్ నగర్‌లోని శ్రీ విద్యాభ్యాస పాఠశాలలో, మణుగూరు ఏరియా సింగరేణి రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల ఆధ్వర్యంలో 150 కిలోల బియ్యం, పండ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు సేకరించిన సొమ్ములో ఖర్చులు పోను మిగిలిన సొమ్ముతో పేద విద్యార్థులకు బియ్యం అందజేయడం అభినందనీయమని కొనియాడారు. తన వంతు కర్తవ్యంగా పాఠశాల అభివృద్ధికి రూ. 17,000 ఆర్థిక సహాయం అందజేశారు. దాతల సహకారంతో విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ, నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సివిల్ డిపార్ట్ మెంట్ సూపర్ వైజర్లు ఈ.ఈ. రామ్ చరణ్, జె. నవీన్ కుమార్, వత్సవాయి రవి వర్మ, కార్యక్రమ సమన్వయకర్త ఏ. మంగీలాల్, రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు కె. గురుమూర్తి, ఎం. సాంబశివరావు, యు. శివరామకృష్ణ, ఐ. గోపి, డి. రామకృష్ణ, ఎం. గురుప్రసాద్, పాఠశాల నిర్వాహకులు బి. జగన్మోహన్ రెడ్డి, కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



కరువు మండలంగా ప్రకటించడంపై హర్షం

-ప్రకటనలకే పరిమితం కావొద్దు.. తక్షణమే క్షేత్రస్థాయి సహాయం అందించాలి
-ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవక, పెట్టిన పెట్టుబడులు చేతికి రాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా అధికారికంగా ప్రకటించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ప్రకటనతోనే సరిపెట్టకుండా, పంట నష్టపోయిన రైతులకు తక్షణమే ఆర్థిక సహాయం అందించి ఆదు కోవాల్సిన అవసరం ఉంది.

ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించాలి

ఖరీఫ్ సీజన్‌లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులతో రైతులు పంటలు నష్టపోయి పెట్టుబడులు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ప్రతి రైతుకు ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అందించాలి. అర్హు లైన రైతులందరికీ ఎలాంటి జాప్యం లేకుండా పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేయాలి

పంటలు సరిగా పండకపోవడంతో రైతులు పాత వ్యవసాయ రుణాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచు కుని పాత రుణాలను రీషెడ్యూల్ చేయడంతో పాటు, తదుపరి సాగుకు కొత్త రుణాలు మంజూరు చేయాలి. పరిహారం సకాలంలో అందితేనే రైతులకు ఆర్థిక భారం కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుంది.

ఉపాధి పనులు పెంచాలి..
తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కరువు పరిస్థితులతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గ కుండా ఉపాధి హామీ పథకం కింద పనిదినాలను పెంచాలి. గ్రామీణ పేదలు వలసలు వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి కల్పించాలి. రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బం దులు లేకుండా చూడాలి.



రైతులను ఆదుకోవాలి:
పల్లెబోయిన బుచ్చిబాబు రైతు రామచంద్రపురం

నేలకొండపల్లి మండలాన్ని కరువు మండ లంగా ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వానికి, మంత్రి పొంగులేటి శ్రీని వాసరెడ్డికి రైతుల తరపున కృతజ్ఞతలు. వర్షాభావంతో పంటలు దెబ్బ తిని పెట్టుబడులు నష్టపోయాం. ప్రభుత్వం ప్రకటించిన కరువు సహాయం త్వరగా అందుతుందని ఆశిస్తున్నాం.

వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించాలి:
యాడ్ల తిరుపతిరావు
వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు



కరువు పరిస్థితులతో వ్యవసాయ పనులు తగ్గి గ్రామీణ కూలీలకు ఉపాధి కరువవు తోంది. కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారుతోంది. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పనిదినాలను పెంచి, గ్రామాల్లో నిరంతరం పనులు కల్పించాలి. కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించి, వలసలు వెళ్లాల్సిన పరిస్థితిని నివారించాలి.

ప్రభుత్వం తక్షణమే స్పందించాలి :
సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు



నేలకొండపల్లి మండలాన్ని కరువు మండ లంగా ప్రకటించడం రైతులకు ప్రాథమి కంగా ఊరటనిచ్చే అంశం. అయితే పంట నష్టపోయిన రైతుల ఖాతాల్లో పరిహారం జమ అయినప్పుడే నిజమైన ప్రయోజనం చేకూరుతుంది. ఎకరాకు రూ.25 వేల నష్ట పరిహారం చెల్లించడంతో పాటు పాత వ్యవ సాయ రుణాలను రీషెడ్యూల్ చేసి, కొత్త రుణాలు మంజూరు చేయాలి. కరువు సహా యక చర్యలు క్షేత్రస్థాయిలో అమలు చేసి రైతులకు భరోసా కల్పించాలి.

కార్మికుల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే మార్గం

ఘనంగా ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/సుజాతనగర్: సుజాతనగర్ సీపీఐ కార్యాలయం లో ఏఐటీయూసీ 107వ ఆవిర్భా వ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీ యూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యు లు జక్కుల రాములు సంఘం జెం డాను ఆవిష్కరించారు. దండు నాగే శ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు ప్రసంగించారు. దేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కుమారి హనుమంతరావు కోరారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను ఆదుకోవాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలు అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జక్కుల రాములు, కుమారి హనుమంతరావు, బొడ్డు కేశవరావు, భూక్యా దశ్రు, వీర్ల మల్లేష్, దండు నాగేశ్వరరావు, వీర్ల దుర్గాప్రసాద్, రాజేందర్, దండు సురేష్, ప్రభాకర్, హనుమంతు, వెంకన్న, రవి, ధర్మా రావు, శీను తదితర సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులు పాల్గొన్నారు.



2440 ఎకరాల్లో పామాయిల్ సాగు



- తిరుమలాయపాలెం మండలంలో పామాయిల్‌పై రైతుల మొగ్గు
- బీడు భూములకు మహర్దశ
- పాలేరు డివిజన్ ఉద్యానవన శాఖ అధికారిణి అపర్ణ


(ఫైల్)

ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : ఒకప్పుడు వర్షాభావ పరిస్థితుల కారణంగా తిరుమలాయపాలెం మండలంలో వేలాది ఎకరాల వ్యవసాయ భూములు సాగునీరు అందక బీడు భూములుగా మారిపోయాయి. సాగుకు అనుకూలమైన భూములు ఉన్నప్పటికీ నీటి వసతి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితులు ఉండేవి. అయితే ప్రస్తుతం భక్తరామదాసు ప్రాజెక్టు నీటితో మండలంలో చెరువులు నిండుతుండటంతో భూగర్భ జల మట్టాలు పెరిగి వ్యవసాయానికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో రైతులు సంప్రదాయ పంటలతో పాటు దీర్ఘకాలిక ఆదాయాన్ని అందించే పామాయిల్ సాగుపై ఆసక్తి చూపుతున్నారని పాలేరు డివిజన్ ఉద్యానవన శాఖ అధికారిణి అపర్ణ తెలిపారు.

ఏటేటా పెరుగుతున్న పామాయిల్ సాగు విస్తీర్ణం :

తిరుమలాయపాలెం మండలంలో ప్రస్తుతం సుమారు 2,440 ఎకరాల్లో పామాయిల్ సాగు జరుగుతోందని అధికారులు వెల్లడించారు. గతంలో సాగునీటి కొరతతో పంటలు పండించలేని భూములు సైతం ప్రస్తుతం పామాయిల్ సాగును ప్రత్యామ్నాయ పంటగా ఎంచుకుంటున్నారు. తక్కువ శ్రమతో దీర్ఘకాలం ఆదాయం పొందే అవకాశం ఉండటంతో ఈ పంట వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు.

ఎకరాకు రూ.51వేల వరకు ప్రభుత్వ ప్రోత్సాహం..

పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు వివిధ రకాల రాయితీలు, ఆర్థిక సహాయం అందిస్తోందని అపర్ణ తెలిపారు. ఎకరాకు డ్రిప్ పరికరాలు, మొక్కలు, అంతర పంటల సాగుకు సంబంధించిన ఎరువుల తదితర అవసరాల కోసం ఏడాదికి రూ.51వేలకు ప్రోత్సాహక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. ఈ సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని పామాయిల్ సాగు విస్తీర్ణాన్ని పెంచుకోవాలని సూచించారు.

మూడేళ్ల తర్వాత దిగుబడి- దీర్ఘకాలిక ఆదాయం ..

పామాయిల్ మొక్కలు నాటిన 36 నెలల నుంచి గెలలు కోతకు వస్తాయని, అనంతరం రైతులకు దిగుబడి ద్వారా ఆదాయం సమకూరుతుందని అపర్ణ తెలిపారు. సరైన పద్ధతుల్లో తోటల నిర్వహణ, నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం చేపడితే మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. బీడు భూములను సాగులోకి తీసుకురావడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు పామాయిల్ సాగు దోహదపడుతుందని తెలిపారు. మండలంలోని ఆసక్తి ఉన్న రైతులు పామాయిల్ సాగుపై అవగాహన పెంచుకుని ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని అపర్ణ కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను వినియోగించుకుని పామాయిల్ సాగు ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆమె సూచించారు.

కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలు చేయదు



ప్రజాపక్షం/ తల్లాడ : తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కపై సిపిఎం నాయకులు చేస్తున్న నిరాధార అసత్య ఆరోపణలను తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆదివారం తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనివాసరావు, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కంపూడి కిషోర్ ల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం మండల నాయకత్వం ఉనికి కోల్పోయి ప్రజల్లో పూర్తిగా పలసనైందని అందుకే ఇలాంటి చౌకబారు రాజకీయాలకు పాల్పడుతుందని మండి పడ్డారు. తల్లాడ మండలంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క దిష్టి బొమ్మ దగ్ధం చేయడం వారి దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. సామినేని రామారావు హత్య ఘటన చాలా బాధాకరమని ఈ ఘటన కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లవరం సర్పంచ్ కిరణ్‌కుమార్, అంబేద్కర్ నగర్ సర్పంచ్ బాబు, తెలగవరం సర్పంచ్ కాళోజీ, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి ఈ ప్రాంత పరిస్థితులపై దృష్టి సారించాలి



- ప్రజా సమస్యలు పట్టించుకోని ఎంఎల్ఏ
- హంగూ ఆర్బాటాలకే ప్రాధాన్యత
- గాడితప్పుతున్న పంచాయితీ పాలన
- టిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చైతన్య

ప్రజాపక్షం/భద్రాచలం : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ ప్రాంత పరిస్థితులపై దృష్టి సారించాలని తెలంగాణ రక్షణసేన (టిఆర్ఎస్) రాష్ట్ర మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి కంగాల చైతన్య అన్నారు. ఆదివారం స్థానిక టూరిజం హోటళ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రామలాయాభివృద్ధి పనుల పర్యవేక్షణను నిత్యం భద్రాచలం వచ్చే పోయే మంత్రికి బూర్గంపాడు రోడ్డు, చర్ల నుండి వెంకటాపురం రోడ్డు దుస్థితి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. స్థానిక ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు ప్రజా సమస్యలను గాలికొదిలేసి హంగు ఆర్బాటాలకే ప్రాధాన్యతనిస్తున్నారని, అరాచక శక్తులను ఆయన ప్రక్కనే చుట్టూ తిప్పుకుంటూ ఆయనకున్న మంచిపేరును పాడుచేసుకుంటున్నారని ఆరోపించారు. గ్రామపంచాయితీ పాలన గాడితప్పుతోందని, పట్టణంలోని కాలనీల్లో అపరిశుభ్రత పేరుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో హామీలు గుప్పించిన కాంగ్రెస్ సర్పంచ్, వార్డు సభ్యులు తీరా గెలిచిన తర్వాత ముఖం చాటేసి సొంతపనులు పైరవీలకు ప్రాధాన్యతిస్తున్నారని మండిపడ్డారు. పేదలు తమకు ఇంటి నెంబర్లు ఇవ్వాలంటూ దరఖాస్తులు చేసుకుంటున్నప్పటికీ కనీసం పట్టించుకోవడం లేదని, ఆన్‌లైన్ పనిచేయడం లేదంటూ కుంటసాకులు చెబుతూ తమకు కావాల్సిన వారికి అన్ని పనులు చేసిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాచల నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారంలో గత బిఆర్ఎస్ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలు చవతి తల్లి ప్రేమను చూపించాయని, ప్రజా సమస్యలను గాలికొదిలేసిన ప్రజాప్రతినిధులు అర్ధిక వనరులు సమకూర్చుకునేందుకే ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలు, నియోజవర్గంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి తెలంగాణ రక్షణ సేన పాలకులను ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. త్వరలో నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించి టిఆర్ఎస్ అధిష్టానానికి ఇక్కడి సమస్యలను తెలియజేయస్తామని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో కాంచన లీలావతితో పాటు పలువురు మహిళా విభాగ నాయకురాళ్లు పాల్గొన్నారు.

సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న మాజీ ఎంఎల్ఎ



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండలంలోని నారాయణపురం గ్రామంలో వేమిరెడ్డి వీరప్రసాద్‌రెడ్డి గృహంలో ఆదివారం సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య హాజరై వ్రతంలో పాల్గొన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో ఉండాలని స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, తల్లాడ మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, మాజీ జెడ్పిటిసి ప్రమీల, దాసురావు, జనార్థన్‌రెడ్డి, వీరప్రసాద్‌రెడ్డి, లలితకుమారి, కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు ఇండియన్ గ్లోరీ అవార్డు



ప్రజాపక్షం/ తల్లాడ : సమాజంలో పేదలకు లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన స్థానిక లయన్స్ ప్రతినిధి దారా శ్రీనివాసరావును ఇండియన్ గ్లోరీ అవార్డుకు ఎంపిక చేశారు. కళారత్న మూవీస్ ఆధ్వర్యంలో జరిగి ఈ ఎంపికలో భాగంగా హైదరాబాద్ జూబ్లీ క్లబ్స్ ప్రసాద్ ల్యాబ్‌లో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. సినీ హీరో సుమన్ శాలువతో సత్కరించి అవార్డును అందజేశారు. 2025 26 సంవత్సరాలకు కార్యక్రమాలు చేపట్టినందుకు గాను ఈ అవార్డుకు ఎంపికయ్యారు. గత పదేళ్లుగా పేద విద్యార్థులకు, అభాగ్యులకు, నిరుపేద వృద్ధులకు చేయూతనందించి లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో తల్లాడ లయన్స్ క్లబ్ అధ్యక్షులు కర్నాటి లక్ష్మారెడ్డి, సెక్రటరీ సుధానాయుడు, ట్రెజరర్ రామాంజనేయ, తల్లాడ లయన్స్ క్లబ్ సభ్యులు, పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

భగవద్గీత శ్లోకాల పోటీల్లో టాలెంట్ స్కూల్ విద్యార్థుల విజయకేతనం

జిల్లా స్థాయిలో ప్రథమ, తృతీయ స్థానాలు కైవసం



ప్రజాపక్షం/సత్తుపల్లి: ఖమ్మం జిల్లా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి భగవద్గీత శ్లోకాల పోటీల్లో సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి విజయా లు సాధించారు. సీనియర్స్ విభాగంలో చిన్నంశెట్టి లాస్య శ్రీ ప్రథమ స్థానం, షేక్ ఆస్పియా తృతీయ స్థానం సాధించగా, జూనియర్స్ విభాగంలో జి. వకుల్ సావర్కర్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. విజేతలకు విశ్వహిందూ పరిషత్ నిర్వాహకులు, ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే భగవద్గీత శ్లోకాల పోటీల్లో ప్రతిభ కనబరిచిన మూడో తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,500 చొప్పున నగదు బహుమతులు అందించి ప్రోత్సహించారు. విద్యార్థుల విజయంపై పాఠశాల కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పులి అరుణ, ఇన్‌చార్జి శంకర్, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేస్తూ విజేతలను అభినందించారు. చిన్ననాటి నుంచే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువల పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలో కాంగ్రెస్ ర్యాలీ

ర్యాలీలో పాల్గొన్న సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్



ప్రజాపక్షం/సత్తుపల్లి: ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కుల సంరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన భారీ ర్యాలీలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ ర్యాలీకి హాజరై సంఘీభావం తెలిపారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని, ఓటు చోరీకి పాల్పడుతోందని ఆరోపిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్, సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షుడు సందీప్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ డప్పు వాయిస్తూ, పాట ద్వారా నిరసన వ్యక్తం చేసి ప్రజాస్వామ్య పరిరక్షణకు తన సంఘీభావాన్ని చాటుకున్నారు.